సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025



హోరా హోరీగా బండలాగుడు పోటీలు

అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి సన్నిధిలో మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం నిర్వహించిన బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. -8లో



గంజాయి స్వాధీనం

అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. -8లో

గరిష్టం/కనిష్టం
33.6/19.9

వాతావరణం

జిల్లాలో గురువారం 19.9 - 33.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలోని ఇంజనీరింగ్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న విష్ణువర్ధన్ రెడ్డిని కమిషనర్ మనోజ్ రెడ్డి సస్పెండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీస్ మేటర్స్‌లో లంచం అడిగారనే అభియోగాలపై ఆయనను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. నగరపాలక సంస్థలో ఎవరు అవినీతికి పాల్పడిన ఇదే తరహా చర్యలు ఉంటాయని కమిషనర్ హెచ్చరించారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి 8న జాతీయలోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి కె. ప్రత్యూషకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 08562- 258622 ఫోన్ నంబర్లో, ఈ మెయిల్ అడ్రస్:కడప.డికోర్ట్స్.జీవోవి.ఇన్, డీఎల్ఎస్ఏకేడీపీ అట్‌ది రేటాఫ్ జీమెయిల్‌డాట్‌కాంలలో సంప్రదించాలని పేర్కొన్నారు.


పొలతలలో తాత్కాలిక హుండీ కానుకలు లెక్కింపు

పెండ్లిమర్రి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పొలతల క్షేత్రంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హుండీలను గురువారం గండి దేవస్థానం ఈఓ వెంకటసుబ్బయ్య, ఆలయ ఈఓ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో లెక్కించారు. ఉత్సవాల మూడు రోజులకు గానూ మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాములవారి వద్ద ఉన్న తాత్కాలిక హుండీలు, లడ్డు ప్రసాదం, సేవా టిక్కెట్లు, తాత్కాలిక దుకాణాలకు రూ.27,01,718 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును మూడు నెలలు పొడిగిస్తున్నట్లు డీఐపీఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1 నుంచి మే 31వ తేదీ వరకు పొడగించామన్నారు. ఈ లోపు కొత్త అక్రిడేషన్ కార్డుల జారీ చేపడితే అప్పటి వరకు ఈ పొడగింపు వర్తిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో ఈ నెల 28వ తేదీ నాటికి అక్రిడిటేషన్ కార్డుల వ్యాలిడిటి కలిగి పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే పొడగింపు సౌకర్యం ఉంటుందని తెలిపారు. సంబంధిత మీడియా యాజమాన్యం తమ సంస్థల్లో పనిచేస్తున్న, తొలగించిన జర్నలిస్టుల వివరాలను తమకు అందించాలని తెలిపారు.

నేడు జానమద్ది వర్ధంతి



కడప కల్చరల్: సీపీ బ్రౌన్ గ్రంథాలయ నిర్మాత, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి 11వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించనున్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. ఈ సందర్భంగా రీజినల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు ఆచార్య పి.ఆర్. హరినాథ్ (మైసూరు) 'తెలుగు పద్య వైభవం - శబ్ద సౌందర్యం' అనే అంశంపై స్మారకోపన్యాసం చేస్తారని తెలిపారు. ముఖ్య అతిథిగా వైవీయూ వైస్‌ఛాన్సలర్ ఆచార్య ఫణితిప్రకాష్ బాబు హాజరుకానున్నట్లు తెలిపారు. సభాధ్యక్షులుగా యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, విశిష్ట అతిథిగా వైవీయూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, గౌరవ అతిథిగా బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ పాల్గొంటారని తెలిపారు.


25వ రోజుకు పశువైద్య విద్యార్థుల దీక్ష



స్టైఫండ్ పెంచాలని నినాదాలు చేస్తున్న పశువైద్య విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్: మండల పరిధి గోపవరం గ్రామ సమీపంలోని పశువైద్య కళాశాల విద్యార్థులు స్టైఫండ్ పెంచాలని చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 25వ రోజుకు చేరుకున్నాయి. ఎంబీబీఎస్ మెడికల్ విద్యార్థులతో సమానంగా తమకు స్టైఫండ్ పెంచాలని పశువైద్య విద్యార్థులు నినాదాలు చేశారు. 25 రోజులుగా తాము దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. స్టైఫండ్ పెంపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

సర్వే గుట్టు బాబుకెరుక!



- పీ4 సర్వే పేరిట వ్యక్తిగత వివరాలు సేకరిస్తున్న సచివాలయ సిబ్బంది
- మార్చి 3 నాటికి సర్వే పరిపూర్తి
- సంక్షేమ పథకాల ఎత్తివేతకేనని బలపడుతున్న అనుమానాలు

కడప సెవెన్‌రోడ్స్: పీ4 పేరిట రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేపై జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సంక్షేమ పథకాల ఎత్తివేతకే ఈ సర్వే చేస్తున్నారన్న అనుమానం బలపడుతోంది. ఇప్పటికే ఎన్నికల ముందు ఎడతెరిపి లేని హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని అమలు పరచకపోగా ఏదో ఒక నెపంతో నీరుగార్చే యత్నాలు చేపట్టిన విషయం ఇప్పటికే ప్రజల్లో చర్చనీయాంశంగా ఉంది. తాజాగా పైలెట్ ప్రాజెక్టు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా ఈనెల 20వ తేది నుంచి జిల్లాలో పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్టిసిపేషన్ (పీపీపీ) పేరిట సర్వే నిర్వహిస్తున్నారు. మార్చి 3వ తేది నాటికి సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలో 4,70,365 కుటుంబాలు ఉండగా, ఇప్పటికి 1,88,893 కుటుంబాలను అంటే 40.16 శాతం సర్వే పూర్తి చేశారు. ఇందులో 157213 కుటుంబాల (83.23 శాతం) ఆమోదం తీసుకున్నారు. ఇక 2,81,472 కుటుంబాల వద్దకు వెళ్లి సర్వే నిర్వహించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని 645 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 20 శాతం నిరుపేద కుటుంబాలు గుర్తించి గ్రామ సభల ద్వారా నిర్ధారిస్తామంటున్నారు. పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలు, దాతల సహకారంతో గుర్తించిన నిరుపేదల జీవన పరిస్థితులు మెరుగు పరచడమే సర్వే ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు అంటున్నారు.


ఎన్నో సందేహాలు!

సర్వేలో కుటుంబ సభ్యుల పేరిట వ్యవసాయభూమి ఎంత ఉంది? మున్సిపల్ ప్రాంతాల్లో ఎన్ని సొంత గృహాలు ఉన్నాయి? నాలుగు చక్రాల వాహనాలు ఏమైనా ఉన్నాయా? కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారా? ఇన్‌కం ట్యాక్స్ ఏమైనా చెల్లిస్తున్నారా? నెలకు విద్యుత్ వినియోగం ఎంతమంది అనే అంశాలపై సచివాలయ సిబ్బంది ఆరా తీస్తున్నారు. సర్వే సిబ్బంది సేకరిస్తున్న వివరాల్లో ఎక్కువభాగం ఆదాయానికి సంబంధించిన ప్రశ్నలే ఉండడం పలు సందేహాలకు తావిస్తోంది.

నాడు సంక్షేమ జాతర..నేడు పాతర

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో నవరత్నాల పేరిట అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన విషయం తెలిసిందే. సచివాలయ సిబ్బంది ద్వారా సంక్షేమం అర్హత కలిగిన ప్రతి ఇంటి గడపను తాకింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సంక్షేమం పూర్తిగా అటకెక్కింది. ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునే వ్యూహంలో భాగంగా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి నాయకులు ప్రజలకు అలవిగాని హామీలు ఇచ్చారు. గెలుపే లక్ష్యంగా ఎన్డీయే నేతలు హామీల వర్షం కురిపించారు. అధికారంలోకి వస్తూనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు గొంతు సవరించారు. పెన్షన్ రూ. 1000లు పెంచామని గొప్పలు చెప్పకుంటున్న ప్రభుత్వం విచారణ పేరుతో వేలాది పెన్షన్లను తొలగించే చర్యలు ఇప్పటికే చేపట్టిన విషయం తెలిసిందే. తాజాగా పీ4 సర్వే చేపట్టడం ఇందులోభాగమనే సందేహాలు ప్రజానీకంలో వ్యక్తమవుతున్నాయి. సర్వేలో పాల్గొనేందుకు నిరాకరించిన వారి పేర్లు సైతం నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించడం, అలాంటి వివరాలు నమోదు చేసినపుడు బయో మెట్రిక్ ద్వారా ధృవీకరించాలని కూడా చెప్పడం అనుమానాలు బలపడేందుకు కారణాలుగా ఉన్నాయి. సంపాదన పరుల జాబితాలో వ్యవసాయ కూలీలు, పెన్షనర్ల పేర్లు కూడా చోటుచేసుకున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సర్వేపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్వేగుట్టు బాబుకే ఎరుకని పరిశీలకులు వివరిస్తున్నారు.

ప్రజాస్వామ్యం ఖూనీ



టీడీపీ కూటమి నియంతృత్వ పాలనతో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. రాజ్యాంగ హక్కులను కాలరాస్తోంది. పౌరుల ప్రాథమిక హక్కులను అణచివేస్తోంది.తాజాగా ప్రముఖ సినీనటుడు పోసాని కృష్ణమురళిని హైదరాబాద్‌లో అక్రమంగా అరెస్టు చేయడం టీడీపీ కూటమి ప్రభుత్వ కక్షసాధింపునకు నిదర్శనం. అక్రమ అరెస్టును పలువురు నాయకులు ఖండించారు.

–సాక్షి నెట్‌వర్క్

కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట



పోసాని కృష్ణమురళి అరెస్టు కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ అరెస్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఇటువంటి అక్రమ అరెస్టులు చేయటం దారుణమైన చర్య. చంద్రబాబు ఒక నియంతలా వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో కక్ష రాజకీయాలు మంచివి కావు.

–ఆకేపాటి అమరనాథరెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే

పోసాని అరెస్ట్ అప్రజాస్వామికం



రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తోంది. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ కక్షసాధింపు చర్యలకు దిగుతూనే ఉంది. కూటమిప్రభుత్వం 9 నెలల పాలనలో ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై అక్రమ కేసులు పెడుతోంది. ప్రశ్నించే ప్రతి గొంతును నొక్కాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.

– నిసార్ అహ్మద్, మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త

రాష్ట్రంలో ప్రజలకు వాక్ స్వాతంత్య్రం లేకుండా పోయింది



సినీ ప్రముఖుడు పోసాని కృష్ణ మురళిని పోలీసులు అరెస్ట్ చేయడం దుర్మార్గం. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలనకు పోసాని అరెస్ట్ అద్దం పడుతోంది.అనంతపురం నుంచి వచ్చామని అబద్ధాలు చెప్పి ఆయన్ను అదుపులోకి తీసుకున్న పోలీసులు, అరెస్టు విషయంలో సైతం తప్పుదోవ పట్టించారు.ఆ పోలీసులు అన్నమయ్య జిల్లా సంబేపల్లికి చెందిన వారని, నోటీసులో పేర్కొన్న సెక్షన్లకు.. ఆయనకు ఎలాంటి సంబంధం లేదు.పోసాని క్రిష్ణ మురళి టీవీ డిబేట్లలో న్యాయపరంగా, చట్టపరంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేస్తారు.అలాంటి వ్యక్తిని అరెస్ట్ చేయడం బాధాకరం.విమర్శలను కూటమి ప్రభుత్వం తట్టుకోలేకపోతోంది. ప్రజలకు ఉన్న వాక్ స్వాతంత్ర్యాన్ని కూడా హరిస్తూ మాట్లాడాలంటేనే భయపడే పరిస్థితికి తీసుకొచ్చారు.

– ఎస్‌బీ అంజద్‌బాషా, మాజీ డిప్యూటీ సీఎం

పులివాహనంపై వీరభద్రుడి విహారం



పులివాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవారు

రాయచోటి టౌన్: రాయచోటి వీరభద్రస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం స్వామి వారు పులివాహనంపై ఊరేగారు. అర్చకులు ఉదయం స్వామి, అమ్మవారికి అభిషేకాలు జరిపారు.అనంతరం రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి ప్రత్యేకంగా పులివాహనంపై కొలువుదీర్చారు. రాయచోటి పురవీధుల్లో ఊరేగించారు. మార్కెట్ వీధి, గాంధీబజార్, కంసలవీధి, బ్రాహ్మణ వీధుల గుండా ఊరేగింపు కొనసాగింది. భక్తులు స్వామి, అమ్మవార్లకు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.కార్యక్రమంలో ఈవో డీవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

మహా సంప్రోక్షణకు ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న సీఈ సత్యనారాయణ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో జీర్ణోద్ధరణ పనులు చివరి దశకు చేరుకున్నాయి.దీంతో మహా సంప్రోక్షణకు అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని తిరుమల-తిరుపతి దేవస్థానం సివిల్ విభాగం చీఫ్ ఇంజనీర్ టీవీ సత్యనారాయణ గురువారం సంబంధిత అధికారులు, గుత్తేదారులకు సూచించారు. మహా సంప్రోక్షణకు విచ్చేసే భక్తుల కోసం అన్ని వసతులు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఎండ నుంచి ఉపశమనం కల్గించేందుకు చలువపందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అనంతరం శాశ్వత కల్యాణ వేదిక వద్ద బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు సూచనలు ఇచ్చారు. సివిల్ విభాగం ఎస్ఈ మనోహర్, ఈఈ సుమతి, డీఈ నాగరాజు, ఏఈ అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

నాటుసారా రహిత జిల్లా లక్ష్యంగా 'నవోదయం'

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: నాటుసారా రహిత జిల్లాగా మార్చడమే.. నవోదయం 2.0 ప్రధాన ఉద్దేశమని, ఆ దిశగా జిల్లాలో సమూలంగా నాటుసారాను నిర్మూలించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా ప్రొహిబిషన్- ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలన కార్యక్రమం 'నవోదయం 2.0'పై ఎస్పీ అశోక్ కుమార్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడుతో కలిసి కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నాటుసారా రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. జిల్లా చుట్టూ చాలా జిల్లాల సరిహద్దు ప్రాంతాలను కలిగి ఉండడంతో... ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీలు మరింత సూక్ష్మ దృష్టి సారించాలన్నారు. నవోదయం 2.0పై డివిజన్, గ్రామస్థాయి సమావేశాలను వచ్చే నెల రోజుల్లోపు నిర్వహించాలన్నారు. గ్రామాలు, పట్టణాల లో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నాటుసారా వినియోగం వల్ల కలిగే.. ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్ప్రభావాలను వివరించాలని, నాటుసారా తాగడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలన్నారు. రెండు నెలల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం అమలుపై అన్ని అనుబంధ శాఖలు ప్రత్యేక దష్టి సారించాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా నాటుసారా, అక్రమ మద్యం, గంజాయి సరఫరా వంటి సమాచారం తెలిస్తే.. టోల్ ఫ్రీ నెం : 14405 కాల్ చేసి తెలియజేసి జిల్లాను నాటుసారా రహితంగా మార్చడంలో తమ వంతు భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ సమావేశంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, జడ్పి సిఈఓ ఓబులమ్మ, ప్రొహిబిషన్ - ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్. రవికుమార్, డిఆర్డీఏ పీడి ఆనంద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో తాగునీటి కొరత రాకూడదు


కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో తాగునీటి కొరత లేకుండా ప్రణాళిక బద్ధ చర్యలు చేపట్టాలని, గ్రామ, పట్టణ ప్రాంతాల్లో నీటి సమస్య రాకుండా నీటి వనరులను గుర్తించి శాశ్వత నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో తాగునీటిపై ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య రాకుండా ముందస్తుగానే ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. నీటి సరఫరా సమయ వేళలను నిర్దేశించి నీటిని సరఫరా చేయాలని అన్నారు. ఆయా పనులకు సంబంధించి వెంటనే ప్రతిపాదనలు చేసి సాంకేతిక పరమైన ప్రణాళికతో పనులు చేపట్టాలని అన్నారు. నీటిని పొదుపుగా వాడుకునేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ ఈ ఏడుకొండలు, ఇరిగేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు వేళాయె!

- మార్చి 1 నుంచి పరీక్షలు ప్రారంభం
- అన్ని పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాల ఏర్పాటు
- 32,885 మంది విద్యార్థులకు 69 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు



పరీక్షలకు సిద్ధం చేసిన టేబుళ్లు



కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 1 నుంచి జిల్లావ్యాప్తంగా ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈ ఏడాది జిల్లాలో 152 జూనియర్ కళాశాలలకు సంబంధించి 32,885 మంది విద్యార్థులు రాయనున్నారు. వీరికి సంబంధించిన హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో జారీ అవుతున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇంటర్ విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. అన్ని పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తు న్నారు. పరీక్షల ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల నిఘానీడలో నడవనున్నాయి. దీంతోపాటు పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లకు, డిపార్టుమెంట్ ఆఫీసర్లకు పరీక్ష నిర్వహణపై శిక్షణ కార్యక్రమం కూడా పూర్తయింది.

పరీక్షా కేంద్రాలపై ప్రత్యేక నిఘా ..

ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఇందుకోసం అన్ని పరీక్షా కేంద్రాలలో కలిసి 950 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిని ఆన్‌లైన్ స్ట్రీమింగ్ చేస్తున్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు ఎలా రాస్తున్నారనే విషయాన్ని అటు బోర్డు నుంచి ఇంటర్మీడియట్ అధికారులు, ఇటు జిల్లా అధికారులు నిరంతరం పర్యక్షించేందుకు వీలుగా కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి పర్యవేక్షించనున్నారు. దీంతోపాటు జిల్లాలో 13 పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఇక్కడ సిట్టింగ్ లేదా ఫ్లయింగ్ స్క్వాడ్స్ ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది. దీంతోపాటు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తో పాటు పోలీసు బందోబస్తు కల్పించనున్నారు. జిల్లావ్యాప్తంగా పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు 3 టీమ్స్‌ను ఫ్లయింగ్ స్క్వాడ్‌గా, 10 సిట్టింగ్ స్క్వాడ్‌గాపాటు డీఈసీ, స్పెషల్ ఆఫీసర్, ఆర్ఐవో కూడా పరీక్షలను పర్యవేక్షించనున్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను పోలీసు బందోబస్తు నడుమ స్టోరేజ్ పాయింట్లలో భద్రపరిచారు.

మేనేజ్‌మెంట్	1-ఇయర్	2-ఇయర్	మొత్తం
మోడల్	211	154	365
హైస్కూల్ ప్లస్	248	138	386
ప్రైవేటు ఎయిడెడ్	338	330	668
కేజీబీవీ	548	379	927
ఒకేషనల్	517	483	1000
సోసియల్‌వెల్ఫేర్	618	543	1161
గవర్నమెంట్	2581	2116	4697
ప్రైవేటు కాలేజీలు	12053	11628	23681
మొత్తం	17114	15771	32885

జిల్లాలో 64 పరీక్షా కేంద్రాలు

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల కోసం జిల్లాలో 64 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరానికి సంబంధించి 17114 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 15,771 మంది విద్యార్థులు ఈ పరీక్షలను రాయనున్నారు. 64 పరీక్షా కేంద్రాలకు 64 మంది ఛీఫ్ సూపరింటెంటెంట్లు, 64 డిపార్టుమెంట్ ఆఫీసర్లతోపాటు 700 మంది ఇన్విజిలేటర్స్‌ను నియమించారు.

సర్వం సిద్ధం



ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశాం. ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలను నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. పిల్లలంతా తమకు సంబంధించిన హాల్ టికెట్లతో తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు పరీక్ష సమయానికి ముందుగానే చేరుకోవాలి. పిల్లలకు కావాల్సిన అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేశాం. ఎవరు ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా పరీక్షలను రాయాలి.

– బండి వెంకటసుబ్బయ్య, ఆర్ఐవో, ఇంటర్ విద్య

క్లుప్తంగా

45 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లను చూపుతున్న ఎక్సైజ్ సీఐ

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురం క్రాస్ వద్ద కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యాన్ని అక్రమంగా అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. 45 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

గంజాయి స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి

బద్వేలు అర్బన్ : అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1.800 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ బి.సీతారామిరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సిద్దవటం రోడ్డులోని ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. తమతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నీలకంఠేశ్వరరెడ్డి, వారి సిబ్బందితో కలిసి స్టేషన్ పరిధిలోని పి.పి.కుంట చెక్‌పోస్టు వద్ద గురువారం వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచిఒక ద్విచక్ర వాహనాన్ని, 850 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనంతరం వారిని విచారించగా వారు ఇచ్చిన సమాచారం మేరకు నెల్లూరు జిల్లా నాయుడుపేటకు చెందిన మరో వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 950 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. గంజాయి అక్రమ రవాణాలో ప్రమేయం ఉన్న మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ హెడ్ కానిస్టేబుళ్లు కృష్ణారెడ్డి, రంగస్వామి, నారాయణరెడ్డి, బాలయేసు, కానిస్టేబుళ్లు విష్ణువర్ధన్‌రెడ్డి, కొండలరావు, హుస్సేన్ వలి, గురయ్య తదితరులు పాల్గొన్నారు.

బంగారు, నగదు చోరీ



చోరీ జరిగిన గృహాన్ని పరిశీలిస్తున్న సీఐ ఎస్కే రోషన్

వల్లూరు : వల్లూరు మండల పరిధిలోని తోల్ల గంగనపల్లె క్రాస్ వద్ద కడప- తాడిపత్రి ప్రధాన రహదారిలో ఉన్న మామిళ్ల గురివిరెడ్డి ఇంటిలో బుధవారం రాత్రి బంగారు, నగదు చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు మామిళ్ల గురివి రెడ్డి తన ఇంటిలోని డబుల్ కాట్‌కు ఉన్న లాకర్‌లో బంగారు, నగదు ఉంచి శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రి అలాడుపల్లెలోని ఆలయంలో జాగరణ చేసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. ఇంటిలో ఎవరూ లేనట్లు గమనించిన దుండగులు ఇంటి ప్రధాన ద్వారానికి ఉన్న తాళాన్ని తొలగించి లోనికి ప్రవేశించారు. బెడ్ రూంలోకి వెళ్లి డబుల్ కాట్ లాకర్‌లో ఉన్న 80 గ్రాముల బంగారు, రూ. 40 వేల నగదును చోరీ చేశారు. గురువారం ఉదయం ఇంటికి చేరుకున్న గురివిరెడ్డి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న కమలాపురం సీఐ ఎస్కే రోషన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసు జాగిలంతో ఇంటిలో తనిఖీ చేశారు. వేలి ముద్రల నిపుణులు వేలి ముద్రలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

హోరా హోరీగా బండలాగుడు పోటీలు



అల్లాడుపల్లెలో జన సందోహం నడుమ బండలాగుతున్న మైదుకూరు ఎద్దు



అశ్వ వాహనంపై భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఊరేగింపు

అల్లాడుపల్లెలో ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి సన్నిధిలో మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం నిర్వహించిన బండలాగుడు పోటీలు జన సందోహం నడుమ హోరాహోరీగా జరిగాయి.

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీలను ఆలయ కమిటీ సభ్యులు వీర నారాయణ యాదవ్, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూషేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలలో మైదుకూరుకు చెందిన వెంకటేశ్ యాదవ్ ఎద్దు ప్రథమ స్థానంలో నిలువగా, ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన మార్తల చంద్రఓబుళరెడ్డి ఎద్దు ద్వితీయ, రంగసాయపల్లెకు చెందిన వెంకటసుబ్బారెడ్డి ఎద్దు తృతీయ స్థానంలో నిలిచాయి. చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దు నాలుగో స్థానం, కమలాపురానికి చెందిన టీవీ సుబ్బరాయుడు ఎద్దు ఐదో స్థానం, ప్రొద్దుటూరు మండలం పెన్నానగర్‌కు చెందిన మహబూబ్ బాషా ఎద్దు ఆరో స్థానంలో గెలుపొందాయి. గెలుపొందిన ఎద్ల యజమానులకు విశ్వనాథపురానికి చెందిన కార్తీక్‌రెడ్డి రూ.1,01,116లు, నెర్రవాడకు చెందిన చల్లా గంగయ్య, కల్లూరుకు చెందిన కృష్ణయ్య రూ.70,116లు, మైదుకూరుకు చెందిన కొండపల్లి ఉమాకాంత్, శేషగిరి, కమాల్‌బాషా, హుస్సేన్ బాషా రూ.60,116లు, వెదురూరుకు చెందిన పాలెంపల్లె, పెద్ద ఈశ్వర్‌రెడ్డి రూ.40వేలు, అల్లాడుపల్లెకు చెందిన రజకుల సంఘం రూ.20,116లు, పాలెంపల్లె శ్రీహనుమంతురెడ్డి, వీరారెడ్డి, చిన్నవీరారెడ్డి, రామాంజనేయరెడ్డి రూ.12,116లు, కోడూరు వెంకటేశ్ జ్ఞాపకార్థం వారి కుటుంబీలు రూ.5,116లు చొప్పున నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ గురివిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మేకల బాబు, వీరభద్రస్వామి మాజీ చైర్మన్ వీరారెడ్డి, గోసుల కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వైపీ సుబ్బారెడ్డి, వీరనారాయణ యాదవ్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై భద్రకాళి సమేత వీరభద్రస్వామి

మండలంలోని అల్లాడుపల్లెలో వెలసిన శ్రీ వీరభద్ర స్వామి దేవస్థాన సన్నిధిలో మహా శివరాత్రి వేడుకలు పురస్కరించుకుని నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా 9వ రోజు గురువారం ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకూ, అనంతరం సాయంత్రం 5గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామిని అశ్వ వాహనంపై ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తుల నడుమ ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు పెరుగు వీరనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గురివింద గింజలు తిని చిన్నారి మృతి



మృతిచెందిన చిన్నారి మంజులాబీ

బద్వేలు అర్బన్ : గురివింద గింజలు తిని ఆరేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన గురువారం బద్వేలు పట్టణంలో జరిగింది. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే ప్రకాశం జిల్లా కొమరోలుకు చెందిన మాబుసా, పీరాంబి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. మాబుసా కృష్ణపట్నం ఓడరేవులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుండటంతో ఆయన భార్య కూడా అక్కడే ఉంటోంది. పిల్లలను బద్వేలు పట్టణంలోని గుంతపల్లె క్రాస్‌రోడ్డులో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంచారు. అయితే పెద్ద కుమార్తె అయిన మంజులాబీ (6) పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో యూకేజీ చదువుతోంది. ఆదివారం సెలవుదినం కావడంతో తోటి పిల్లలతో కలిసి ఇంటి సమీపంలో ఆడుకుంటూ గురివింద గింజలు తినింది. కొద్దిసేపటికి వాంతులు, విరేచనాలు కావడంతో అమ్మమ్మ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించింది. అయితే పరిస్థితి విషమంగా ఉందని, ఎక్కడైనా చూపించండి అని వైద్యులు తెలపడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. వారు వచ్చి కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించగా పరిస్థితి మెరుగుపడకపోవడంతో రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



రైలు పట్టాలపై దండే హరీష్‌రెడ్డి మృతదేహం

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు రైల్వే స్టేషన్‌లో రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా.. కర్నూలు జిల్లా ఉయ్యాలవాడ మండలం కాకరవాడ గ్రామానికి చెందిన దండే హరీష్‌రెడ్డి(28) బీటెక్ పూర్తి చేశాడు. రెండు రోజుల క్రితం జమ్మలమడుగు పట్టణంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. గురువారం తెల్లవారుజామున 5 గంటలకు విజయవాడ నుంచి ధర్మవరం వెళుతున్న రైలు జమ్మలమడుగు స్టేషన్ సమీపంలోకి రాగానే హరీష్‌రెడ్డి ఒక్కసారిగా రైలు పట్టాలపై తల పెట్టాడు. దీంతో తల, మొండెం వేరయ్యాయి. కాగా బీటెక్ పూర్తి చేసినా ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

గంగమ్మ తిరునాలలో అపశ్రుతి

సిరిబండి చక్రం ఎక్కడంతో ఆటో డ్రైవర్ మృతి



సిరిబండి ఉత్సవంలో మృతి చెందిన సుదర్శన్

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం తుమ్మలపల్లె గ్రామంలో గురువారం గంగమ్మ తిరునాల సందర్భంగా సిరి బండి లాగుతున్న సమయంలో అపశ్రుతి చోటు చేసుకుంది. సిరి బండి గ్రామం నుంచి బయలుదేరిన సమయంలో ఆటో డ్రైవర్ సుదర్శన్(62)పై సిరిబండి చక్రం ఎక్కడంతో నడుములు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్పృహ కోల్పోయాడు. వెంటనే గ్రామస్తులు అతన్ని ఆసుపత్రికి తరలించే సమయంలో మృతి చెందాడు. ఈ తిరునాలకు భారీగా భక్తులు, గ్రామస్తులు రావడంతో సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. మృతుడు సుదర్శన్‌కు భార్య సౌదామణి, కుమారుడు పురుషోత్తం, కుమార్తె సుజాత ఉన్నారు.

గతంలోనూ జెడ్పీటీసీ మృతి..

రెండేళ్ల క్రితం సిరిబండి మహోత్సవంలో అప్పట్లో పులివెందుల మండల జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి మృతి చెందారు. ఆ సంఘటనను ఇంకా మరవకముందే మళ్లీ ఇప్పుడు అదే తరహాలో మరోమారు ఆటో డ్రైవర్ సుదర్శన్ మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తిరునాల నేపథ్యంలో పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టి ఉంటే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

కడప అర్బన్ : కడప నగరంలోని సెవెన్‌రోడ్స్ సర్కిల్ వద్ద గురువారం రాత్రి ఓ వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కడప ట్రాఫిక్ సీఐ జావేద్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. వృద్ధుడి మృతదేహం వద్ద లభించిన ఆధారాల మేరకు వివరాలిలా ఉన్నాయి. మైదుకూరు మండలం వనిపెంటకు చెందిన షేక్ బాషా మోహిద్ (75) అనే వృద్ధుడు కడపకు పనిమీద వచ్చాడు. ఏడు రోడ్ల కూడలి వద్ద ఆ వృద్ధుడు రోడ్డు దాటుతున్న సమయంలో పాత బస్టాండ్ నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు వచ్చి ఢీకొంది. వృద్ధుడి తలపై బస్సు ఎక్కడంతో తలంతా నుజ్జునుజ్జయింది. పోస్టుమార్టం కోసం వృద్ధుడి మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

వాలీశ్వరకొండపై కర్ణాటక భక్తురాలి మృతి



బల్లసముద్రం కొండపై మృతి చెందిన కర్ణాటక భక్తురాలు వెంకటమ్మ

రామసముద్రం : మండలంలోని బల్లసముద్రం కొండపై వాలీశ్వరస్వామిని దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తురాలు మార్గమధ్యంలో కుప్పకూలి ప్రాణాలు విడిచింది. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు... కర్ణాటక గుండ్లుపురానికి చెందిన భక్తురాలు వెంకటమ్మ(75) గురువారం కాలినడకన కొండపైకి ఎక్కుతోంది. అయితే మార్గమధ్యంలో ఉన్నట్లుండి కుప్పకూలి పడిపోయి అక్కడే మృతి చెందింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి వివరాలు సేకరించారు. కర్ణాటకలోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. కర్ణాటక భక్తురాలు ఎండవేడికి తట్టుకోలేక మరణించిందా..? లేక గుండెపోటుతో మృతి చెందిందా అన్నది తెలియలేదని ఎస్ఐ పేర్కొన్నారు.

• కూలిన ప్రహరీ

తప్పిన ప్రమాదం



కూలిపోయిన ప్రహరీ



ఒరిగిన విద్యుత్ స్తంభం

పులివెందుల రూరల్ : పట్టణంలోని సదాశివారెడ్డి హాస్పిటల్ సమీపంలో ఉన్న మున్సిపల్ క్లస్టర్ కార్యాలయం ప్రహరీ గురువారం కూలిపోయింది. ప్రహరీ పక్కన ఉన్న విద్యుత్ స్తంభం కూడా విరిగిపోయి నేలకొరిగింది. గోడ పక్కనే ఉన్న కారు పూర్తిగా దెబ్బతిన్నట్లు స్థానికులు తెలిపారు. సాధారణంగా ప్రతిరోజు మున్సిపల్ కార్మికులు ప్రహరీ కింద కూర్చొని భోజనాలు చేస్తుండేవారు. గురువారం కూలీలకు సెలవు కావడంతో ఎవరూ అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. లేకపోతే ప్రాణ నష్టం జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

బ్లేడ్‌తో గొంతుకోసుకున్నాడు..అడ్డంగా దొరికిపోయాడు

ప్రొద్దుటూరు క్రైం : ఓ బాలుడు బ్లేడ్‌తో గొంతు కింద కాటు పెట్టుకున్నాడు. తనపై హత్యా యత్నం జరిగిందని బంధువులపై నెట్టే ప్రయత్నం చేశాడు. చివరకు అసలు విషయం తెలియడంతో పోలీసుల వద్ద అడ్డంగా బుక్కయ్యాడు. ప్రొద్దుటూరుకు చెందిన 17 ఏళ్ల బాలుడు చికెన్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. అతను మైదుకూరుకు చెందిన 15 ఏళ్ల బాలికను కొన్ని రోజుల నుంచి ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయం బాలిక కుటుంబ సభ్యులకు తెలిసింది. వేధిస్తున్న విషయం బాలుడి సమీప బంధువుకు చెప్పినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. తర్వాత బాలిక బంధువులు బాలుడిని మందలించారు. అది మనసులో పెట్టుకున్న బాలుడు వారిని ఎలాగైనా ఇబ్బంది పెట్టాలని భావించాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం అతను బ్లేడ్‌తో గొంతు కింద చిన్నపాటి కాటు పెట్టుకున్నాడు. అతనే జిల్లా ఆస్పత్రిలో చేరాడు. బాలిక బంధువులే తన గొంతు కోసి చంపే ప్రయత్నం చేశారని ఔట్‌పోస్టులో ఫిర్యాదు కూడా చేశాడు. బాలుడి గాయం గురించి రూరల్ పోలీసులు డాక్టర్‌తో మాట్లాడారు. చిన్నపాటి గాయమేనని, చర్మం పై భాగంలోనే బ్లేడ్ కాటు ఉన్నట్లు చెప్పారు. బాలుడి ప్రవర్తనపై అనుమానం రావడంతో రూరల్ ఎస్ఐ మహమ్మద్‌రఫీ గట్టిగా విచారణ చేశారు. బాలుడితో మాట్లాడటంతో అసలు నిజం బహిర్గతమైంది. తనపై ఎవరూ హత్యా యత్నం చేయలేదని, తానే గొంతు కింద బ్లేడ్‌తో కోసుకున్నట్లు అతను పోలీసుల వద్ద అంగీకరించాడు. బాలిక బంధువులను బెదిరించాలనే ఈ పని చేసినట్లు చెప్పుకొచ్చాడు. తన కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించిన ఎస్ఐ బాలుడిని మందలించారు. పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నిత్యపూజ స్వామికి రూ.10 లక్షల ఆదాయం



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సిద్దవటం : శ్రీ నిత్యపూజ స్వామికి మహాశివరాత్రి ఉత్సవాల్లో రూ. 10 లక్షల 26 వేల 926 ఆదాయం వచ్చిందని నిత్యపూజ కోన మహా శివరాత్రి ఉత్సవాల ప్రత్యేక అధికారి సి.శివయ్య, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ జ్యోతి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. శ్రీ నిత్యపూజ కోన ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారన్నారు. అలాగే వెండి ఒక కేజీ 324 గ్రాములు, బంగారం రెండు గ్రాముల 650 మిల్లి గ్రాములు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ పి.సురేష్ కుమార్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి మోహన్ రెడ్డి, ఆలయ అర్చకులు, సిద్దవటం, కడప పోలీసులు పాల్గొన్నారు.

కనుల పండువగా కామాక్షి త్రేతేశ్వరుని కల్యాణం



ప్రత్యేక ఆసనంపై కొలువుదీరిన శ్రీకామాక్షిదేవి సమేత త్రేతేశ్వరస్వామి

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరో రోజు గురువారం శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. దేవదాయశాఖ, ఉభయదారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవంలో కామాక్షి దేవి, త్రేతేశ్వరస్వామిని పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక ఆసనంపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలతో ఆలయ ప్రధాన అర్చకులు కె. పద్మనాభశాస్త్రి ఆధ్వర్యంలో వేదపండితులు గణేష్, శశిధర్ స్వాములు వేద మంత్రాలు వల్లిస్తూ కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. కల్యాణం సమయంలో శివనామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అనంతరం కల్యాణంలో పాల్గొన్న భక్తులకు ముత్యాల తలంబ్రాలను అందజేశారు. ఈ కల్యాణ వేడుకలలో మహిళా భక్తులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన నండెం వెంకటసుబ్బయ్య

చింతకొమ్మదిన్నె : కడప-చిత్తూరు జాతీయ రహదారిపై మద్దిమడుగు బిడికి గ్రామ సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నండెం వెంకటసుబ్బయ్య (45) మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాయచోటి నుంచి కడప వైపు వస్తున్న ఏపీ04 జెడ్ 0189 నంబరుగల సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు ముందు వెళుతున్న టీవీఎస్ ఎక్సెల్ వాహనం (ఏపీ04 బీఎస్ 6655)ను వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో టీవీఎస్ ఎక్సెల్ నడుపుతున్న వెంకటసుబ్బయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. మృతుడు రామాపురం మండలం గువ్వలచెరువు వాసిగా నిర్ధారించారు. ఈ ప్రమాద సంఘటనపై చింతకొమ్మదిన్నె పోలీసులు కేసు నమోదు చేశారు.

పెన్నా నదిలో పడి యువకుడి మృతి



పెన్నానదిలో మృతి చెందిన యువకుడు షరీఫ్

సిద్దవటం : సిద్దవటం మండలం జ్యోతి గ్రామ సమీపంలోని పెన్నానదిలో కడపకు చెందిన ఎస్. షరీఫ్ (17) మృతి చెందినట్లు సిద్దవటం పోలీసులు తెలిపారు. మహా శివరాత్రి సందర్భంగా కడపకు చెందిన చాంద్‌బాషా కుమారుడు ఇంటర్మీడియట్ చదువుతున్న ఎస్. షరీఫ్(17) తన స్నేహితులతో కలిసి బుధవారం నిత్యపూజ స్వామి కోనకు వచ్చాడు. మధ్యాహ్నం జ్యోతి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన అన్నదానం వద్ద భోజనం చేశాడు. జ్యోతి గ్రామం నుంచి మాచుపల్లె మీదుగా స్నేహితులతో కలిసి పెన్నానది నీటిలో నడుచుకుంటూ వెళుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో పడి షరీఫ్ మునిగిపోయాడు. అతని స్నేహితులు కడపకు వెళ్లి పెన్నా నీటిలో షరీఫ్ మునిగిపోయిన విషయాన్ని అతని ఇంట్లో చెప్పారు. బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యులు యువకుని కోసం గాలింపు చర్యలు చేపట్టినా కనిపించలేదు. గురువారం యువకుడు షరీఫ్ మృతదేహం పెన్నానదిలో లభ్యమైంది. ఈ మేరకు సిద్దవటం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు.

బ్యాటరీల చోరీ కేసులో నాలుగు నెలలు జైలు



చోరీ కేసులో నిందితుడు

రాయచోటి టౌన్ : సెల్ టవర్ వద్ద మూడు బ్యాటరీలు చోరీ చేసిన కేసులో ముద్దాయికి నాలుగు నెలల జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధించినట్లు అర్బన్ ఎస్ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు. గత ఏడాది ఆగస్టు 9వ తేదీ రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామ సమీపంలో ఎయిర్‌టెల్ టవర్ వద్ద టవర్ కోసం ఏర్పాటు చేసిన రూ.24 వేలు విలువ గల మూడు బ్యాటరీలు చోరీకి గురయ్యాయన్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తి రాయచోటి పట్టణంలోని రాయుడు కాలనీకి చెందిన పెదివీటి దావీదుగా గుర్తించి కేసు నమోదు చేశారన్నారు. దీనిపై విచారణ చేసిన రాయచోటి ఇన్‌చార్జి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పీజే తేజ సాయి ముద్దాయికి ఈ మేరకు శిక్ష విధించారని తెలిపారు. ఈ కేసు విచారణలో పోలీసులు రమేష్, నాగ శంకర్‌లు విశేషమైన కృషి చేశారన్నారు.

రేపటి నుంచి అనంతపురం గంగమ్మ జాతర



భక్తుల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు, చలువ పందిళ్లు

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మ జాతర శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే మిఠాయి బండ్లు, చెరకుల బండ్లు ఇక్కడికి చేరుకున్నాయి. గురువారం భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, పూజారులు చెల్లు గంగరాజు, మదన్ మోహన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. లక్కిరెడ్డిపల్లె సీఐ వెంకటకొండారెడ్డి, ఎస్ఐ రవీంద్ర బాబు బృందితో కలిసి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టారు. అర్చకులు చెల్లు వంశీకులైన చెల్లు గంగరాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనార్దన్, మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.

• అమ్మ ఎవరికైనా అమ్మే!



ప్రేమకు మనుషులే కాదు.. జంతువులు కూడా అతీతం కాదు. అందులోనూ తల్లిప్రేమ. ఈ సృష్టిలో అత్యంత తీయనైనది. పోల్చలేనిది. వర్ణించలేనిది అంటూ ఏదైనా ఉందంటే అది తల్లి ప్రేమే. మనుషులే కాదు.. జంతువులు కూడా తమ తల్లి ప్రేమను చాటడం.. అందులోని మాధుర్యాన్ని పంచడం చూస్తూనే ఉంటాం. అది కేవలం సంతోష సమయంలోనే కాదు.. కష్టకాలంలోనూ ఆ అమ్మప్రేమ బహిర్గతమవుతుంది. అదే తరహాలో ఓ శునకం తల్లి ప్రేమను చాటుకున్న సంఘటన రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె పోలీసు స్టేషన్ ఎదుట కనిపించింది. సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు పోస్ట్ చేశారంటూ విచారణ నిమిత్తం సినీ నటుడు, నిర్మాత, దర్శకుడు పోసాని మురళీ కృష్ణను పోలీసులు హైదరాబాద్ నుంచి ఓబులవారిపల్లె పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. పోలీసు స్టేషన్ లోకి ఎవరూ రాకుండా పోలీసులు గేటు మూసి వేశారు. ఈ సమయంలో తల్లి కుక్క గేటు బయట ఉండిపోగా.. పిల్ల మాత్రం గేటు లోపల ఉండిపోయింది. దీంతో దిక్కు తోచని తల్లి కుక్క తన బిడ్డ కోసం గేటు బయట అలాగే నిరీక్షిస్తూ ఉండగా.. గేటు లోపలి నుంచి ఆ చిన్న శునకం తల్లివైపు అలాగే చూస్తూ నిలబడి పోయింది. సుమారు 3 గంటల తర్వాత గేటు తెరవడంతో తల్లీబిడ్డలు కలిసి పరుగులు తీశాయి. ఈ దృశ్యాన్ని చూసిన వారు తల్లి ప్రేమ ఎంత గొప్పదో కదా.. అమ్మ ఎవరికైనా అమ్మే కదా అంటూ చర్చించుకోవడం విశేషం.

– ఫొటో, ఎస్.కె. మహమ్మద్ రఫీ, సాక్షి ఫొటో గ్రాఫర్, కడప